www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 29 మే 2024
5
వైఎస్ఆర్

వైవీయూ డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల బిఎ, బిబిఎ, బికాం, బిఎస్‌సి 6వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతం సుధాకర్ విడుదల చేశారు. మంగళవారం విశ్వవిద్యాలయంలోని తన ఛాంబర్‌లో వైవీయూ విసి ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్ రెడ్డితో కలిసి పరీక్ష ఫలితాల గణాంకాలను పరిశీలించి విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి ఆచార్య సుధాకర్ మాట్లాడుతూ బిఎ లో 658 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. బిబిఎలో 249 మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ రెండు కోర్సుల్లో 100 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. బీకాంలో 4,012 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 3,947 మంది (98.38 శాతం) ఉత్తీర్ణత పొందారని తెలిపారు. బిఎస్‌సిలో 3,721 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,681 మంది (98.93 శాతం) ఉత్తీర్ణులు అయ్యారని వివరించారు.

టెన్షన్..టెన్షన్..!

- వైసిపి నేతల్లో ఉత్కంఠ
- గెలుపు ధీమాతో టిడిపి
- కౌంటింగ్ కోసం నిరీక్షణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నిక నరాలు తెగే ఉత్కంఠ కలిగిస్తోంది. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వ్యూహంలో భాగమైన ఎన్నికల ప్రచారాలు, ప్రలోభాలు, ద్వితీయశ్రేణి నాయకుల ఫిరాయింపులు వంటి అంశాల్లో ప్రత్యర్థులపై పైచేయి సాధించిన అభ్యర్థుల్లో ధీమా వ్యక్తమవుతోంది. వైఎస్ఆర్ జిల్లాలో పెద్దఎత్తున పోలింగ్ శాతం నమోదు కావడం ఉత్కంఠను కలిగిస్తోంది. ఓటర్లలో చైతన్యస్థాయి పెరగడం, ప్రధాన పార్టీల అభ్యర్థుల డబ్బు పంపిణీ తదితర అంశాలు కారణాలుగా నిలుస్తుండడం తెలిసిందే. మహిళలు, వృద్ధులు, యువత పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. కడపలోని గౌస్‌నగర్ తదితర పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి 12 గంటల వరకు పోలింగ్‌లో పాల్గొనడం సార్వత్రిక ఎన్నికల తీవ్రతకు అద్దం పట్టింది. హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు, మహారాష్ట్ర నగరాల నుంచి సాఫ్ట్‌వేర్‌లు, వ్యాపారులు, ఇతర ఉద్యోగులు పెద్దఎత్తున వచ్చి ఓటింగ్‌లో పాల్గొనడంతో ఓటింగ్ పతాకస్థాయికి చేరుకుంది. కడప అసెంబ్లీలో గత సార్వత్రిక ఎన్నికలకు మించి ఓటింగ్ శాతం నమోదు కావడం గమనార్హం.

అందరి చూపూ కౌంటింగ్‌పైనే

జూన్ నాలుగవ తేదీన నిర్వహించనున్న కౌంటింగ్‌పైనే అందరి చూపూ నిలిచింది. సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు మొదలుకుని స్థానిక సంస్థల ప్రతినిధులు, బెట్టింగ్ రాయుళ్లు, కార్యకర్తలు, ప్రజలందరిలో ఉత్కంఠను కలిగిస్తోంది. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి కూటమి అభ్యర్థులు ఎవరి గెలుపు వారు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ యూరప్ పర్యటనకు వెళ్తుండగా సోషల్‌మీడియా విభాగానుద్దేశించి 151 సీట్లు గెలుస్తామని సంకేతాలు ఇవ్వడంతో వైసిపి శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం తొణికిస లాడుతోంది. ఇందుకు కొనసాగింపుగా జూన్ తొమ్మిదిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేస్తుండడం గమనార్హం. విశాఖలో పలు హోటళ్లు..గెస్ట్‌హౌస్‌లు హౌస్‌ఫుల్‌గా మారాయనే వార్తలు వినిపిస్తున్నాయి. వైసిపి హడావుడిని గమనించిన కూటమి నేతలు గుంభనంగా వ్యవహరిస్తున్న వాతావరణం కనిపిస్తోంది. జిల్లా అధికార యంత్రాంగం కౌంటింగ్ ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేస్తున్నారు. రాజకీయ పార్టీలు సైతం తమకు నమ్మకమైన ఏజెంట్లను నియమించుకునే పనిలో నిమగ్నం కావడం గమనార్హం.

సార్వత్రిక ఎన్నికలు ఉత్కంఠను కలిగిస్తున్నాయి. ఈ నెల 13 నాటి పోలింగ్ వైసిపి, టిడిపి మధ్య నువ్వానేనా అనే రీతిలో నడిచింది. పోలింగ్ జరిగిన తీరు అధికార, ప్రతిపక్ష పార్టీల ఎవరి ధీమా వారిదిగా మారింది. రాష్ట్రంలో టిడిపి కూటమి గెలుపుపై పెద్ద ఎత్తున పందేలు సాగుతున్న నేపథ్యంలో టిడిపిలో ఉత్సాహం తొణికిసలాడుతోంది. జగన్ వైసిపికి 151 సీట్లు ఖాయమని సోషల్ మీడియా విభాగాన్ని కలిసిన సందర్భంగా పేర్కొనడం తెలిసిందే. వైసిపి గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తోంది. జగన్ తొమ్మిదిన విశాఖలో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యం గెలుపుపై ధీమాను కలిగిస్తోంది. కూటమి రాష్ట్ర నాయకత్వం విజయం తమదే నంటూ గుంభనంగా వ్యవహరిస్తుండడంతో ఎవరి ధీమా వారిదిగా మారింది. పోలింగ్‌లో మధ్యాహ్నం నుంచి మహిళా ఓటర్లు పోటెత్తడం, పోలింగ్ శాతంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జూన్ నాలుగు వరకు ఉత్కంఠభరిత పరిస్థితి కొనసాగనుంది.

కౌంటింగ్ ఆంక్షలు కఠినతరం

జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సజావుగా, పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించేందుకు శాంతి భద్రతల దృష్ట్యా ఆంక్షలను కఠినతరం చేశామని జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంసిసి అమలు, 144 సెక్షన్ పాటింపుపై ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో చివరి ఘట్టం అయిన ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని జూన్ 4న ఎంతో పటిష్టంగా పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్నిరకాల భద్రతా చర్యలు చేపట్టామన్నారు. కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన ఇవిఎంలను అత్యంత సురక్షితంగా భద్రపరిచామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలో మొత్తం 112 సిసి కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. పార్లమెంట్, అసెంబ్లీకి సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందని, అసెంబ్లీ స్థానాలకు మొదటగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభం అవుతుందని చెప్పారు. పార్లమెంట్‌కు సంబంధించి మొదటగా ఇవిఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుందన్నారు. పొలిటికల్ పార్టీల తరపున కౌంటింగ్ ఏజెంట్ల పాసుల కోసం ఈ నెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఎజెంట్స్ కోసం డిఆర్‌ఒ వద్ద, ఇవిఎం ఓట్ల లెక్కింపు ఏజెంట్ల కోసం ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల వద్ద సంప్రదించాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 7 గంటల లోపు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్ హాల్ లోకి అభ్యర్థి లేదా కౌంటింగ్ ఏజెంట్ ఒక్కరికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. సర్పంచ్, మేయర్, ఇతర కార్పోరేషన్ చైర్మన్‌లు, ప్రభుత్వ సలహాదారులు, లోకల్ బాడీ మెంబర్లు, తదితర ప్రజాప్రతినిధులకు కుడా అనుమతి లేదన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు లోపలికి వచ్చిన కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు బయటికి వెళ్ళడానికి అనుమతి లేదన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా 6 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రత్యేక నిఘాతో పాటు భద్రతా చర్యల్లో భాగంగా పోలీసు ఆంక్షలను కఠినతరం చేస్తామన్నారు. గతంలో నేర నేపత్యం ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులకు వారి ప్రవర్తనను అనుసరించి 4 నుండి 6 వరకు ముందస్తు బైండోవర్ కేసులు, జిల్లా బహిష్కరణ, గృహ నిర్బంధం వంటి చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులతో పాటు సంబందిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, ఎస్‌పి

కౌంటింగ్‌కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

పటిష్టమైన భద్రతా బలగాల మధ్య కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు.మంగళవారం కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన ఇవిఎంలను అత్యంత సురక్షితంగా భద్రపరిచామని చెప్పారు. ఓట్ల లెక్కింపు కోసం ఇప్పటికే సిబ్బందిని ఏర్పాటు చేసి మైక్రోఅబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్లు, సూపర్ వైజర్లు, శిక్షణా కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప, బద్వేలు రిటర్నింగ్ అధికారులు మధుసూదన్, వెంకటరమణ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆడిట్‌ను వాయిదా వేయాలి : యుటిఎఫ్

డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఈనెల 29న నిర్వహించే స్కూల్ కాంపోజిట్ గ్రాంట్స్ ఆడిట్‌ను వాయిదా వేయాలని యుటిఎఫ్ కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. మంగళవారం డిఇఒ అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు, జూన్ 4న కౌంటింగ్, ప్రధానోపాధ్యాయుల శిక్షణ తరగతులను దృష్టిలో ఉంచుకుని స్కూల్ కాంపోజిట్ గ్రాంట్స్ ఆడిట్ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. పై రెండు కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు కచ్చితంగా పాల్గొనాల్సి ఉన్నందున ఆడిట్ కు హాజరు కావడం సాధ్యం కాదని పేర్కొన్నారు. స్పందించిన డిఇఒఎన్నికల కౌంటింగ్ శిక్షణ తరగతులకు హాజరయ్యే ప్రధానోపాధ్యాయులకు ఆడిట్ నుంచి మినహాయింపు కల్పించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళదామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ పాల్గొన్నారు.

ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌ను రద్దు చేయాలి : ఫ్యాప్టో

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరు కాలేదనే కారణంగా జిల్లాలోని 163 మంది ఉపాధ్యాయులకు జారీచేసిన ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో డిఇఒ ఎం.అనురాధకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఫ్యాప్టో జిల్లాశాఖ ఆధ్వర్యంలో డిఇఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయ కుమార్ మాట్లాడుతూ 163 మంది ఉపాధ్యాయులతోపాటు ఎన్నికల శిక్షణ తరగతులకు హాజరు కాలేదని కారణంగా మరో 18 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. తీవ్రమైన అనారోగ్య కారణాల చేత మాత్రమే హాజరు కాలేకపోయారని, అంతే తప్ప కలెక్టర్ ఉత్తర్వులను ఉల్లంఘించాలనే ఆలోచనతో మాత్రం కాదని వివరించారు. తీవ్రమైన అనారోగ్య కారణాల చేత ఎన్నికల విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయుల పట్ల జిల్లా అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో చక్కగా ఎన్నికల విధులు నిర్వహించిన కలెక్టర్‌కు, అధికారులకు ఫ్యాప్టో పక్షాన అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎస్.ఇలియాస్ బాష, కె.ఖాదర్ బాష, పాలెం మహేష్ బాబు, కె.రాజశేఖర్, కె.నరసింహారావు, సి.వి.రమణ పాల్గొన్నారు.

జిల్లా వారసత్వ రక్షణపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న చిన్నపరెడ్డి

జిల్లాలో అపురూపమైన వారసత్వ సంపద ఎంతో ఉందని దాన్ని కాపాడుకోవడంలో భాగంగా ముందుగా విస్తృతంగా ప్రచారం కల్పించనున్నట్లు భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి అన్నారు. ఇంటాక్ బాధ్యతలను చేపట్టి సంవత్సరం గడిచిన సందర్భంగా మంగళవారం స్థానిక గ్రాండ్ ఇన్ హోటల్‌లో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరించారు. మన చరిత పేరిట జిల్లా వారసత్వ సంచికను తీసుకు రానున్నట్లు తెలిపారు. జిల్లాకు అపురూప వారసత్వ సంపదగా నిలిచిన పాత కలెక్టరేట్‌ను శిథిలం కాకుండా కాపాడేందుకు ఇంటాక్ కేంద్ర కార్యాలయం సహకారంతో చర్యలు చేపట్టినట్లు చెప్పారు. దీనికి పూర్తిస్థాయిలో జిల్లా అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సంస్థ సభ్యుల సంఖ్యను మరింతగా పెంచే ఆలోచన ఉందన్నారు. త్వరలో జిల్లాలోని దాదాపు 120 పైగా పర్యాటక చారిత్రక వారసత్వ ప్రదేశాలతో ప్రత్యేకంగా దర్శిని పేరిట వారసత్వ సంచికను తీసుకురానున్నట్లు వివరించారు. త్వరలో కడప ఇంటాక్ కోసం ప్రత్యేకంగా యూట్యూబ్ ఛానల్‌ను కూడా నిర్వహించే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మన చరిత్ర జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలిచి పోనుందని అభినందనలు తెలిపారు. చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ మాట్లాడుతూ జిల్లాలో నేటి తరానికి తెలియాల్సిన వారసత్వ సంపద ఎంతో ఉందని దాన్ని వెలికి తెచ్చి విస్తృతంగా ప్రచారం చేసి రక్షించుకోవాల్సిన అవసరాన్ని ఇంటాక్ గుర్తు చేస్తూ ఉండడం అభినందనీయం అన్నారు. వైవీయూ విశ్రాంత ప్రిన్సిపల్ జి. సాంబశివారెడ్డి మాట్లాడుతూ ఇంటాక్ కార్యవర్గం చిన్నపరెడ్డి నాయకత్వంలో వేగంగా కార్యక్రమాలు చేస్తోందని, సభ్యుల సంఖ్య కార్యక్రమాలలో కూడా తనదైన శైలిలో ప్రత్యేక ముద్ర వేస్తున్నదని అన్నారు. సంస్థ కో - కన్వీనర్ పి. వి. సుబ్బారెడ్డి, పూర్వ కో-కన్వీనర్ వేణుగోపాల్ ప్రసంగించారు. ఈ సందర్భంగా వారసత్వ సంపద ప్రచారం కోసం మన చరిత పేరిట ప్రత్యేక సంచికను విడుదల చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటాక్ సభ్యులు ఎ. వెంకట సుబ్బయ్య, బాలగొండ గంగాధర్, మన చరిత నిర్వహణ, ప్రచురణ కోసం తమ వంతుగా ఆర్థిక సహ కారం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు, కొండూరు జనార్ధన రాజు, డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, యం.రాణి, వెల్లాల వెంకటేశ్వ రాచారి, జ్యోజి రెడ్డి, సంజీవరెడ్డి, రాఘవేంద్ర వర్మ, కల్లూరు బాల ఎల్లా రెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభ మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలోని కెఎస్‌ఆర్‌ఎం, కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానాలలో మంగళవారం ప్రారంభమైన ఎసిఎ సౌత్ జోన్ సీనియర్ మెన్స్ వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్లో అనంతపూర్ జట్టుపై ఐదు వికెట్ల తేడాతో కడప జట్టు విజయం సాధించింది. వేరొక మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై 4 వికెట్ల తేడాతో కర్నూలు జట్టు విజయం సాధించింది. కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో కడప, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. కడప జట్టుకు చెందిన ఎం. హరి శంకర్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఐదు వికెట్లు తీసుకున్నాడు. 209 పరుగుల విజయ లక్ష్యంతో అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు బాగా ఆడుతున్న సమయంలో మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడడంతో అంపైర్లు ఓవర్లను కుదించి విజయ లక్ష్యాన్ని 191 పరుగులకు చేశారు. లక్ష్యాన్ని చేధించి ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కడప జట్టుకు చెందిన జహీర్ అబ్బాస్ 50 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచారు.

కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్నిత 50 ఓవర్లలో 9 వికెట్లను నష్టానికి 273 పరుగులు చేసింది. అనంతరం 274 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగుకు దిగిన కర్నూలు జట్టు 47.5 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 274 పరుగులు సాధించి నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

తలపడుతున్న ఇరు జట్ల క్రీడాకారులు

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి- గోపవరం

ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లరు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ రాబోవు ఎన్నికల ఫలితాలు దృష్ట్యా ర్యాలీలకు, విజయోత్సవాలకు అనుమతి లేదని అన్నారు. విజయ యాత్రలు చేయవద్దని, పార్టీ కార్యాలయాలు, నాయకుల ఇళ్లవద్ద ఫలితాలు వెలబడే రోజు జనాలు గుమ్మిగుడి ఉండకూడదని తెలిపారు. జూన్ 6 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ యుగంధర్, రూరల్ సిఐ విక్రమ్ సింహ, ఎస్ఐలు సత్యనారాయణ, రవికుమార్ పోలీస్ సిబ్బంది అన్ని రాజకీయ పార్టీలు నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతున్న డిఎస్‌పి రవికుమార్

మలబార్ గ్రూప్ ఆహార ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆహార మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న షోరూమ్ హెడ్ లిసన్ సత్యన్

మలబార్ గ్రూప్ పేదల ఆకలి తీర్చేందుకు ఆహార ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కడప స్టోర్ హెడ్ లిసన్ సత్యన్ పేర్కొన్నారు. మంగళవారం కడప షోరూం వద్ద ఆహార పంపిణీ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ కార్యక్రమం గల్ఫ్ దేశాలలోని కొన్ని కేంద్రాలతో పాటు, కేంద్ర పలిత ప్రాంతాలతో సహా 16 రాష్ట్రాలలో విస్తరించి ఉన్న 37 నగరాలలో అమలు అవుతుందని తెలిపారు. ఇప్పుడు 70 నగరాలలో చేపడుతూ ఉందని చెప్పారు. సమాజంలో ఆకలికి సంబంధించి ఆర్థిక కారణాలను అంచనా వేయడానికి తమ ఎన్‌జిఒ వాలంటీర్లు లబ్ధిదారులను సర్వే చేస్తున్నారన్నారు. ఉచిత ఆహారం, వసతి, ఆరోగ్య సంరక్షణ అందించడానికి ఇప్పటికే గ్రాండ్ తమ హోమ్ ప్రాజెక్టును ప్రారంభించిందని పేర్కొన్నారు. అనేక సేవా కార్యక్రమాలను మలబార్ గ్రూపు కొనసాగిస్తూ ఉందని తెలిపారు. కార్యక్రమంలో మలబార్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి- కడప అర్బన్

పాఠశాల సిబ్బందితో ఎంఇఒలు

ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి ఒక్క విద్యార్థికీ నాణ్యమైన భోజనం అందించడమే పిఎం పోషణ ముఖ్య ఉద్దేశమని కడప ఎంఇఒలు పాలెం నారాయణ, ఇర్షాద్ అహ్మద్ సూచించారు. మంగళవారం నగరంలోని నగరపాలక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకంలో సిసిహెచ్ (కుక్ కం హెల్పర్) లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం, కుకింగ్ కాంపిటీషన్ కడప మండల, నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ ప్రధానోపాధ్యాయులు నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సూచించిన, కేటాయించిన మెనూ ప్రకారం రోజూ విద్యార్థులకు పోషనకరమైన ఆహారాన్ని నాణ్యతగా అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతలో రాజీ పడకూడదని తెలిపారు. పరిశుభ్రమైన పదార్థాలతో వంట ను వండి విద్యార్థులకు వడ్డించాలని ఆదేశించారు. అనంతరం రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన సి సి హెచ్ ద్వారా వారి అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో కడప మండలంలోని హెడ్మాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. **చెన్నూరు :** మండలంలోని వంట ఏజెన్సీలకు (మిడ్ డే మీల్స్) ఆయాలకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం రీసెర్చ్ పర్సన్ వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. వంట ఏజెన్సీలు, హెల్పర్లు వంట విధానం, పరిశుభ్రత తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మిడ్ డే మీల్స్ మెనూ ప్రకారం ఉండాలని, అలాగే వంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన శుభ్రత గురించి వివరించారు. అక్కడికి విచ్చేసిన వంట ఏజెన్సీ, ఆయాలకు వంటలపై పోటీలు నిర్వహించి రుచికరంగా చేసినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ -2 సునీత, హెడ్మాస్టర్ పద్మనాభం, వంట ఏజెన్సీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

హర్షితరెడ్డికి అభినందన

ప్రజాశక్తి - కడప


హర్షితరెడ్డిని అభినందిస్తున్న కరస్పాండెంట్

పదవ తరగతి ఫలితాల్లో 600 మార్కులు గాను 594 మార్కులు సాధించిన హర్షిత రెడ్డిని వికాస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ అభినందించారు. కడప నగరం ఐటిఐ సర్కిల్‌లో ఉన్న వికాస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థిని బి. హర్షితా రెడ్డి ఎస్ఎస్ సి - 2024 ఫలితాలలో 600కు గాను 592 మార్కులు సాధించింది. మంగళవారం విడుదల చేసిన ఇంప్రూ వ్మెంట్ ఫలితాల్లో సోషియల్ సబ్జెక్టులో 2 మార్కులు పెరగడంతో 594 మార్కు లు హర్షితా రెడ్డి సాధించింది. ఇంతటి ఘనవిజయం సాధించిన హర్షిత రెడ్డిని పుష్పగుచ్చంతో వికాస్ హరి కృష్ణ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

మాట్లాడుతున్న ప్రాంతీయ కార్యాలయ అధికారి లక్ష్మీతులసి

యూనియన్ బ్యాంకు

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కడప సిటీ

యూనియన్ బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ బండి పిచ్చిరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ ఎస్.వి. రామూర్తి, ప్రముఖ్య ఆర్థో వైద్యులు విద్యాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో యూనియన్ బ్యాంకు మెగా రిటైల్ ఎక్స్‌పోను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బ్యాంకు విశిష్టతను వివరించారు. ప్రాంతీయ కార్యాలయ అధికారి లక్ష్మీతులసి మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు తమ ఖాతాదారులకు అన్ని రకాల సేవలను అందిస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయ, గృహ, వాహన విద్య, సూక్ష్మ మధ్య తరగతి, పారిశ్రామిక రుణాలు అతి తక్కువ వడ్డీకి అందజేస్తుందని వివరించారు. రిటైల్ లోన్ ప్రాసెసింగ్ సెంటర్, ఎంఎస్ఎంఇ రుణాలు పాయింట్ ద్వారా త్వరితగతిన మంజూరు చేస్తున్నామని తెలిపారు. యూనియన్ బ్యాంకు విదేశీ విద్యా రుణం రూ. కోటి 50 లక్షల వరకు అందజేస్తున్నామని చెప్పారు. విద్యా రుణాలు ప్రీమియర్ అబ్రాడ్ యూనివర్సిటీలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు రూ.40 లక్షల వరకు ఎటువంటి తనఖా లేకుండా ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదుపాయం యూనియన్ బ్యాంకులో మాత్రమే ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరు విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా తమ ఖాతాదారులకు వివిధ రకాల రుణ మంజూరు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎడ్యుకేషన్ లోన్ ఖాతాదారులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ కార్ డీలర్లు డీలర్లు తమ కంపెనీ కార్లను ప్రదర్శించారు ఎడ్యుకేషన్ లోన్ కన్సల్టెన్సీ , టాటా రూఫ్ టాప్ సోలార్, ఫైనేస్టో ఇంటీరియర్ డిజైన్ బిల్డర్లు, యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ ఉప అధికారులు రాజ్ కుమార్, షేక్ బాషా, చీఫ్ మేనేజర్లు, కడప శాఖల మేనేజర్లు, రీజనల్ ఆఫీస్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

మతోన్మాదంతో ప్రజలను రెచ్చగొడుతున్నారు

కడప అర్బన్ : పది ఏళ్ల కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజలకు ఏ ఒక్క మంచి పని చేయలేదని, ప్రాజెక్టులు, పరిశ్రమలు నెలకొల్పలేదని చివరికి పోలవరం ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని ఎఐటియుసి కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి. విమర్శించారు. మంగళవారం స్థానిక హోచిమన్ భవన్‌లో ఎఐటియుసి కడప నగర ఆఫీస్ బేరర్స్ సమావేశం నగర ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్దె మద్దిలేటి మాట్లాడుతూ ప్రదాని నరేంద్రమోడీ ప్రజలను మతోన్మాదంతో ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని వాపోయారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో ప్రజలను మభ్యపెట్టడానికి పచ్చి అబద్దాలు ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వాహన స్టార్టింగ్ సమస్య.. ఇబ్బందుల్లో 108 సిబ్బంది

ప్రజాశక్తి - ముద్దనూరు

అత్యవసర వేళల్లో ప్రజలకు వైద్య సేవలు అందించే 108 వాహనం సెల్ఫ్ పని చేయక స్టార్టింగ్ సమస్య తలెత్తింది. సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబులెన్స్ స్టార్టింగ్ సమస్య వల్ల వ్యాను ఎత్తుగా ఉన్న ప్రదేశాల్లో నిలిపి టైర్ల కింద రాళ్ళు పెట్టి నిలుపుకునే దుస్థితి ఏర్పడింది. 108 వాహనం సెల్ఫ్ స్టార్ట్ కాకపోవడంతో ప్రజల సాయంతో తోసుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది. అంబులెన్స్ ఆగిపోతే ప్రజలు అందుబాటులో లేని ప్రదేశాల్లో మళ్లీ స్టార్ట్ చేయాలంటే సిబ్బందికి తీవ్ర అవస్థలు తపపడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించే 108 వాహనానికి మరమ్మతులు చేపట్టి అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి 108 వాహన స్టార్టింగ్ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలో 33/11 కెవి గవర్నమెంట్ హాస్పటల్ సబ్‌స్టేషన్ పరిధిలో, 11 కెవి గవర్నమెంట్ హాస్పిటల్ ఫీడర్, 33/11 కేవీ కోతి సమాధి సబ్ స్టేషన్ పరిధిలో, 11 కెవి పార్లపల్లి రోడ్డు ఫీడర్ పరిధిలో చెట్లు, మొక్కలు తొలగిస్తున్నందున బుధవారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ జెఇ రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తహాశీల్దార్ రమాకుమారికి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ నరసమ్మ

అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోండి

ఇడమడక గ్రామ సర్పంచ్ నరసమ్మ వినతి

ప్రజాశక్తి - దువ్వూరు :

మండల పరిధిలోని ఇడమడక గ్రామపంచాయతీ చెన్నకేశవ స్వామి దేవస్థానం భూముల నుంచి అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ నరసమ్మ మంగళవారం తహాశీల్దార్ రమాకుమారి, ఎస్ఐ శ్రీనివాసులు, ఇఒలకు ఫిర్యాదు చేశారు. రాత్రి సమయాల్లో జెసిబి, ట్రాక్టర్లతో మట్టి తవ్వకాలు జరుపుతున్నారని, అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా ఆక్రమ మట్టి తవ్వకాలు ఎలా జరుపుతారని, వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడి ఊరేగింపు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని శ్రీనారాపుర వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు మంగళవారం నారాపుర వెంకటేశ్వర స్వామిని అర్చకులు, సిబ్బంది సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగింపు నిర్వహిం చారు. మహిళలు, చిన్నారులు లయబద్ధంగా నాట్యమాడుతూ కోలాటం వేశారు. కార్యక్రమంలో టిటిడి నారాపుర వెంకటేశ్వర స్వామి దేవాలయ అర్చకులు, ఆలయ అధికారి, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత ఏదీ..!

నాసిరకం ఇటుకల వినియోగం - నెర్రెలు చీలిన గోడలు - అర్హత లేని కాంట్రాక్టర్లచే ఇళ్ల నిర్మాణం - పట్టని అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపించింది. వాటి నిర్మాణాలు నాసిరకంగా సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారం ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. వీటి మనుగడపై లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. సొంత ఇల్లు అనేది సామాన్య, మధ్య తరగతి కుటుంబాల కల. వైసిపి నాయకులు వారి కలలను కలగానే మిగిల్చారు. ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీలో దాదాపు 900 గృహాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం జగనన్న కాలనీలో 278 ఇళ్లు పూర్తయినట్లు చెబుతున్నప్పటికీ.. గత మూడేళ్లలో నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేసింది కేవలం 15 మాత్రమే. అధికారపార్టీ చోటామోటా నాయకులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి అర్హత లేకపోయినా జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. సిమెంట్ తక్కువ, ఇసుక ఎక్కువ వేసి నిర్మాణాలు చేస్తున్నారని, చేతితో రుద్దితే గోడకు వేసిన పూతలు రాలిపోతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. నిర్మాణానికి ఫ్లైయాష్ ఇటుకలు వాడుతున్నారని, అవి కూడా చేతిలోనే పిండి అవుతున్నాయని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలు ఇళ్ల నిర్మాణాలు పిల్లర్లు లేకుండానే చేపడుతున్నారని, పూర్తి నిర్మాణం కాక మునుపే నెర్రెలు చీలి కుంగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం పూర్తయితే అవి ఎప్పుడు పడిపోతాయోనని లబ్ధిదారుల కుటుంబం బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన పరిస్థితి. నాణ్యత లేకుండా నిర్మాణాలు చేస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే పథకాలు రానివ్వకుండా చేస్తామంటూ కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలు కాక అదనంగా రూ.35 వేలు కాంట్రాక్టర్లకు ఇచ్చామని, అది సరిపోక ఇంకా డబ్బులు కావాలంటూ కొందరు కాంట్రాక్టర్లు వేధిస్తున్నారంటూ పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. రానున్న వర్షాకాలంలో నిర్మాణాలు పూర్తయ్యేలోపు ఎన్ని ఇళ్లు కూలుతాయో చెప్పలేని నాణ్యతతో వాటి నిర్మాణాలు జరిగాయంటూ పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పటికైనా జగనన్న కాలనీలో జరుగుతున్న అవకతవకలపై, నాణ్యత లేకుండా నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు అధికారులను కోరుతున్నారు. నాణ్యతలేని నిర్మాణాలకు బిల్లులు చెల్లించకుండా మళ్లీ నాణ్యత ప్రమాణాలతో నిర్మించేలా అధికారులు దృష్టి సారించి, పేదల సొంతింటి కలను నిజం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నాసిరకంగా నిర్మాణాలు చేపట్టడంతో నెర్రెలు చీలిన గోడలు

ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలి..

జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షలు ఏ మాత్రం సరిపోవడం లేదు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకై అప్పులు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. కాంట్రాక్టర్లు నాసిరకంగా ఇల్లు నిర్మిస్తున్నప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్లు వారి స్వలాభం కోసం నాణ్యతలేని ఇటుకలు, తక్కువ సిమెంట్ వినియోగిస్తూ నిర్మాణాలు చేస్తుండడంతో గోడలు, స్లాబులు నెర్రెలు చీలుతున్నాయి. కాంట్రాక్టర్లు కాకుండా నేరుగా ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలి. లేకుంటే ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలి.

- రాధాకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, ఎర్రగుంట్ల

బిల్లులు ఆపేలా ఆదేశాలు ఇచ్చాం..

జగనన్న కాలనీలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మాణాలు చేస్తే బిల్లులు ఆపేలా సచివాలయ అమినిటీస్‌కు ఆదేశాలు ఇచ్చాం. బిల్లులు పెట్టేముందు అమినిటీస్ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి నెర్రెలు చీలిన గోడలు ఉంటే కాంట్రాక్టర్లను పిలిపించి సరిచేసిన తర్వాతనే బిల్లులు మంజూరు చేస్తున్నాం. ఎన్నికల దృష్ట్యా నిర్మాణ పనులు నెమ్మదించాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు పనులు మళ్లీ ప్రారంభించాం. త్వరలోనే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం. లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించి, నాణ్యత లేకపోతే ఫిర్యాదులు చేస్తే బిల్లులు ఆపడంతోపాటు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటాం.

- రామకృష్ణ, హౌసింగ్ ఎఇ, ఎర్రగుంట్ల

మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కడప అర్బన్ : ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్ఒ నాగరాజు, సిబ్బంది

ప్రజాశక్తి - కడప అర్బన్

యుక్త వయసు వచ్చాక రజస్వల మొదలుకుని మెనోపాజ్ వరకు రుతుక్రమం ఉంటుంది, ఆ సమయంలో శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యంతో పాటు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని వైఎస్ఆర్ జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. మంగళవారం 'రుతుక్రమం- పరిశుభ్రత'పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలసరి సమయంలో స్త్రీ లను అంటరాని వారిలాగా చూసే సంస్కృతి ఇంకా చాలామందిలో ఉందని పేర్కొన్నారు. ఇది సాంఘికంగా అన్యాయమని, వారికి మానసికంగా ధైర్యాన్ని ఇస్తూ, అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఆ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమని పేర్కొన్నారు. శానిటరీ నాప్కిన్స్ వాడకం విధిగా పెట్టుకోవాలని, వాడేసిన శానిటరీ నాప్కిన్స్‌ను శుభ్రంగా పేపర్‌లో, కవర్ లో చుట్టి కాల్చివేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, స్టెప్ మేనేజర్ సుబ్బారాయుడు, ఐసిడిఎస్ పీడీ లక్ష్మి, మెప్మా పీడి సురేష్ రెడ్డి, డిఎంహెచ్ఒ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, స్టాటిస్టికల్ ఆఫీసర్, డేమో విభాగం సిబ్బంది, ఆర్‌కెఎస్‌కె కన్సల్టెంట్ వెంకటరమణ, పట్టణ పరిధిలోని వైద్యులు, కౌమార ఆరోగ్య కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, భరత లక్ష్మి, అనిల్ కుమార్, ప్రభావతి, మీనా, సుబ్రమణ్యం లతో పాటు వార్డు సచివాలయ పరిధిలోని నర్సింగ్ సిబ్బంది, ఆశా, వివిధ సంఘాల సిబ్బంది పాల్గొన్నారు. **చెన్నూరు :** రుతుక్రమం అనేది ఒక సాధారణ ప్రక్రియ అని ఇందులో ఎవరూ సిగ్గు పడాల్సిన అవసరం లేదని ఐసిడిఎస్ సిడిపిఒ రమాదేవి అన్నారు. రుతు క్రమం- పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకొని 14 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల పిల్లలకు రుతుక్రమం- పరిశుభ్రతపై మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా ఎంపిడిఒ కార్యాలయం నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు చంద్రకళ, ఉమా మహేశ్వరి, నాగజ్యోతి, విఒలు, కిశోరి బాలికలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. **ఖాజీపేట :** మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలని మండల వైద్య అధికారిణి ముబీన్ పేర్కొన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఖాజీపేట-1 అంగన్వాడీ కేంద్రం, పురవీధుల్లో రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు ఆదేశాలను అనుసరించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల పరిధిలో రుతుకమం- ఆరోగ్యం పరిశుభ్రత, నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం అంటూ ర్యాలీ చేశారు. హాజరైన మహిళలను ఉద్దేశించి వైద్య సిబ్బంది మాట్లాడుతూ రుతుస్రావానికి కారణాలు, సాధారణ, అసాధారణ లక్షణాలు, ఈ సందర్భంగా ఎదుర్కునే ఇబ్బందులు, వాటి నివారణ, పాటించవలసిన పరిశుభ్రత విధానాలు గురించి వివరించారు. ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగభూషణం మాట్లాడారు. ఆశ నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, సూపర్‌వైజర్స్ శోభన్‌బాబు, కృష్ణప్రియ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్స్ శ్రీదేవి, భారతి, రమాదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఇందిర, మౌలిక, ఎఎన్ఎంలు శాంతమ్మ, వెంకటసుబ్బమ్మ, సునీత, శివనాగమణి, పకృతమ్మ, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది, స్థానిక కిశోర బాలికలు, మహిళలు పాల్గొన్నారు. **చాపాడు :** ప్రతి సంవత్సరం మే 28న రుతుక్రమ, ఆరోగ్య పరిశుభ్రత దినోత్సవాన్ని జరుపుతారని సమగ్ర శిశు పథక అధికారిణి సి.సావిత్రమ్మ, చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. చాపాడు సమగ్ర శిశు పథక కార్యాలయంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో కౌమార దశలో ఉన్న బాలికలు, పెద్ద సంఖ్యలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలు నెలసరి సమయంలో ఐరన్, ప్రోటీన్ సమృద్ధిగి ఉండే మంచి సమతుల ఆహారం తీసుకోవడం చాలా అవసరమన్నారు. నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ పి.కావ్యమాధురి రుతుకమం, ఆరోగ్యం పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. మొర్రాయిపల్లె, సోమపురం గ్రామంలో డాక్టర్ శ్రీవాణి రుతుక్రమం, ఆరోగ్యం పరిశుభ్రత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, హెల్త్ సూపర్‌వైజర్స్ బాబురెడ్డి, సరస్వతి, అంగన్వాడీ సూపర్వైజర్స్ సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** మండలంలోని చిలంకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రుతుక్రమ ఆరోగ్య పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా వైద్యులు సాయిచరిత రెడ్డి, గణేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందికి మంగళవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. కౌమార బాలికలు నెలసరి సమయంలో శానిటరీ ప్యాడ్లు క్రమం తప్పకుండా వాడాలని, శుభ్రమైన లోదుస్తులు ధరించాలని సూచించారు. నీరు ఎక్కువగా తాగాలని మహిళలకు చెప్పాలన్నారు. ఐసిడిఎస్ సిడిపిఒ ముంతాజ్ బేగం మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల్య వివాహాల వలన మాతృ, శిశు మరణాలు సంభవిస్తాయని వివరించారు. సమావేశం అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు, ఐసిడిఎస్ సిబ్బంది, బాలికలు చిలమకూరులోని ప్రధాన రహదారుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ నాగమురెడ్డి, హెల్త్ సూపర్వైజర్ సుభద్ర, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రవీణ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** పులివెందుల పట్టణం జెండామాను వీధిలోని కిశోర బాలికలకు, మహిళలకు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై మంగళవారం ఐసీడీఎస్ సీడీపీఓ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ కిశోర వయసులో ముఖ్యంగా నెలసరి సమయంలో పాడ్స్ ఎలా వాడాలి. ఎలా వాటిని పారవేయాలి, కడుపు నొప్పి వస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి వాటిపై అవగాహన కల్పించారు. సీడీపీఓ శ్రీలత, సూపర్‌వైజర్ నాగేశ్వరి, ఎఎన్ఎం సోమేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

చాపాడు : సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేష్‌కుమార్

ఖాజీపేట : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఎర్రగుంట్ల : ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, మహిళలు

IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE AT :: KADAPA
O.S. No. 1064/2022

Kapil Chit Funds Private Ltd., Kadapa Branch, Represented. by its Recovery Manager, Kadapa.
... Plaintiff

VS

1. Kadapa Allabakash, S/o K. Hussain Saheb, aged about 43 years, Muslim, Profession by Doctor, residing at Door No.6/1171, Sankarapuram, Kadapa
2. Sunkesula Jaharabi, D/o. S. Leela Appaji, aged about 29 years, Muslim, working as Librarian in Vikas Degree College, Kadapa, Residing at D. No. 3/157, Akkayapalli, Kadapa.
3. Kadapa Khaderbi, D/o. K. Hussain Saheb, aged abut 31 years, Muslim, working as Librarian in Global M.B.A. College, Kadapa, R/o. at D.No. 6/1185, Sankarapuram, Kadapa
4. Sunkesula Moulali, S/o. S. Leela Appaji, aged about 31 years, Muslim, Principal in Vikas Degree College, Kadapa, R/o. No. D.No. 6/1171, Sankarapuram, Kadapa
5. Kadapa Khader Valli, S/o. K. Hussain Saheb, aged about 38 years, Director Satya Bhama Nursing college, Kadapa, R/o. D.No. 6/1171, Sankarapuram, Kadapa.

... Defendants No. 1 to 5

Summons To Deffendants No.1 to 5

పై కేసు నెంబర్‌లోని వాది, ప్రతివాదులు నెం.1 నుండి 5 అయిన మీ మీద తనకు రావలసిన దావా మొత్తం రాబట్టు కొనుటకు గాను పై దావాను దాఖలు చేసినందున యిందువిషయమై మీ యొక్క హజరుకు గాను **11-07-2024**న పైన తెలిపిన కోర్ట్ నందు వాయిదా యున్నది. కావున అ తేది న ఉ॥**10.30** గంటలకు మీరు ఖుద్దునగాని, వకీలు ద్వారాగాని పై కోర్టులో నందు హాజరై కోర్టువారితో ఏమైనా అక్షేపణలు ఉన్నయెడల మనవి చేసుకోవలసినది. లేనియెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుడురని తెలియచేయడమైనది.

// కోర్ట్ వారి ఉత్తర్వు మేరకు //

వాయిదా 11.07.2024

యం. నాగిరెడ్డి
వాది తరపున అడ్వకేట్
కడప

వేరుశనగ కాయలు పంపిణీ

లింగాల : మండలంలోని రైతులకు మంగళవారం వేరుశనగ కాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, ఎఒ రమేష్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 259 మంది రైతులకుగానూ 227 క్వింటాళ్ళు పంపిణీ చేశామన్నారు. వేరుశనగ పంటను సాగు చేసే రైతులు తమ దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలో తమ ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్ బుక్, ఫోన్ నెంబర్ ఇవ్వాలని ఎఒ రమేష్ సూచించారు.

రైతులకు విత్తనకాయలు అందజేస్తున్న అధికారులు

IN THE COURT OF THE HON'BLE PRINCIPLE JUNIOR CIVIL JUDGE COURT, KADAPA
O.S.No. 370/2023

Union Bank of India, Rept. by its Branch Manager, Main Branch, Sankarapuram, Kadapa.
...Plaintiff

Vs

G.Uttanna, S/o.G.Pakeeraiah, resident of House No.93/67-1137-1, Indra Nagar, Mamillapalli Village, C.K.Dinne Mandal, YSR District.
...Defendant No.2

NOTICE

The above referred the plaintiff bank has filed suit for recovery in O.S.No.370/2023, in the above court and same is posted for your appearance on 24.06.2024, at 10.30 A.M, If you're not appear before the Hon'ble Court, the Hon'ble court will take appropriate steps against you.

//By Order of the Hon'ble Court//

G.VENKATESWARA REDDY,
Advocate
KADAPA.

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు



ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఎన్‌టిఆర్ 101వ జయంతి సందర్భంగా పులివెందుల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో పులివెందుల టిడిపి పట్టణాధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాదరెడ్డి, నియోజకవర్గ పార్టీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ జయంతిని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఖాజీపేటలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెదేపా మండలం సీనియర్ నాయకులు, కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, నాగేష్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ఎన్‌టిఆర్ తెలుగు జాతి ఆత్మ గౌరవానికి ప్రతీక అని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో దేవగుడి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు. **బ్రహ్మంగారిమఠం :** మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి మండలశాఖ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నందమూరి తారకరామారావు 101వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులరెడ్డి, పట్టాభి, వాసు, ధర్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సంద ర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో భూపేష్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు ఎన్‌టిఆర్ చిత్రప టానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ జన్మదిన సంద ర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు సంజీవరెడ్డి, మల్లు గోపాల్‌రెడ్డి, రాజారెడ్డి, శివారెడ్డి, జంగంరెడ్డి, పెద్దసేట్, రమేష్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, నాగభూషణం, కొండారెడ్డి, మోహన్, వెంకటేష్, మాబు, రమేష్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **చాపాడు :** ఎన్‌టిఆర్ 101వ జయంతి వేడుకలను పార్టీ కార్యాలయంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రామారావు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు శేఖర్ రెడ్డి, సుదర్శన్ యాదవ్, నారపరెడ్డి, సుబ్బిరెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. **చెన్నూరులో :** కమలాపురం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి పిలుపుమేరకు మండల కేంద్రమైన చెన్నూరు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, సినీ నటులు నందమూరి తారక రామారావు 101 పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఉదయం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు విజయ భాస్కర్‌రెడ్డి. క్లస్టర్ ఇన్‌ఛార్జి తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, యువనాయకులు ఆవుల పవన్ కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి పలువురు నాయకులు ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందమూరి తారక రామారావు పేదల గుండెల్లో గూడు కట్టుకున్న వ్యక్తి అని వారు అభివర్ణించారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మన్నూర్ అక్బర్, చెన్నయ్య, ఆటో బాబు, ఆకుల చలపతి, నారాయణ. సుధాకర్‌రెడ్డి, వేల్పుల సుబ్రహ్మణ్యం, రాంప్రసాద్, మైనార్టీ నాయకులు ఖాజా హుస్సేన్, షబ్బీర్ హుసేన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అల్లం ఖాన్ పల్లె లక్ష్మీరెడ్డి అన్నారు. సోమవారం నందమూరి తారక రామారావు 101 జయంతి సందర్భంగా నగరంలోని బాలికల కళాశాల వద్ద ఉన్న ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తి నందమూరి తారక రామారావు అన్నారు. ఎన్టీఆర్ మన మధ్య లేకపోవచ్చు గాని తెలుగువారి మదిలో ఆయన ఎప్పుడూ నివసించే ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సి.ఎస్. నాసర్ అలీ, జయరామిరెడ్డి, మామిళ్ళ శివ, ఉ క్యాయిపల్లి మురళి, రవిశంకర్, రాజా, ఎల్లయ్య, రంతు, భద్రయ్య, ఈశ్వరయ్య, శ్రీదేవి, నిర్మల, రాయల్ కరిముల్లా, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ, లింగారెడ్డి, రమణారెడ్డి

కడపలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లక్ష్మీ రెడ్డి